


అడెల్లిలో భక్తుల సందడి

శ్రీ అడెల్లి మహాపోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

8లో▸



పులుల కదలికల పరిశీలన

ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం గుంజాల, గొల్లఘాట్ గ్రామాల శివారులో పులులు సంచరిస్తున్న ప్రాంతాలను అటవీశాఖ అధికారులు పరిశీలించి పాద ముద్రలు, కొలతలు సేకరించారు.

8లో▸

గరిష్టం/కనిష్టం
35.5 / 19.6

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండతీవ్రత, ఉక్కపోత అధికమవుతుంది. చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

సమీకృత కలెక్టరేట్ పనులు త్వరగా పూర్తి చేయాలి

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



పనులు పరిశీలిస్తున్న మంత్రి ఐకేరెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎల్లపెల్లి సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి వెంట మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, సంబంధిత అధికారులు ఉన్నారు.

కుక్కలు, కోతులు, పందుల బెడద నివారిస్తాం



మాట్లాడుతున్న కమిషనర్ రత్నాకర్‌రావు

ఖానాపూర్: పట్టణంలో రోజురోజుకూ పెరిగిపోతున్న కోతులు, కుక్కలు, పందుల బెడద నివారణకు చర్యలు చేపడతామని మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌రావు అన్నారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని చికెన్, మటన్, చేపల వ్యాపారులు వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ ఇష్టారాజ్యంగా వేయవద్దన్నారు. అలా వేసిన వారికి జరిమానా విధించడంతో పాటు దుకాణాల లైసెన్స్‌ను కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ చెత్తబండిలోనే వ్యర్థాలను వేయాలని ఆయన సూచించారు.

సంఘ అభ్యున్నతికి కృషి చేస్తా

- టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్



ఎన్నికైన నూతన కార్యవర్గం

నిర్మల్‌చైన్‌గేట్: సంఘ అభ్యున్నతికి కృషి చేస్తానని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడిగా మూడోసారి ఎన్నికైన వెలుమల ప్రభాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఆదివారం దొండి సాయినాథ్, కె.ధర్మానంద్ గౌడ్ ఆధ్వర్యంలో సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెలుమల ప్రభాకర్, సెక్రటరీగా కూడాల రవికుమార్, కోశాధికారిగా భీమ సురేందర్, ఉపాధ్యక్షులుగా గడ్డం శ్రీనివాస్, జావీద్ హుస్సేన్, బి.రవీందర్, మహిళా ఉపాధ్యక్షురాలిగా స్రవంతి, జాయింట్ సెక్రటరీలుగా ఎం.జగదీశ్వర్, సోమిరెడ్డి మోహన్‌రెడ్డి , జబీయొద్దీన్, జాయింట్ సెక్రటరీగా విజయగౌరి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్.శ్రీధర్, పబ్లిసిటీ సెక్రటరీగా ఎం గంగాధర్, కల్చరల్ సెక్రటరీగా సత్యం, ఆఫీస్ సెక్రటరీగా కె.శ్రీనివాస్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా అశోక్, గోదావరి, యోగేశ్వర్, శ్రీనివాస్, అమరేందర్, హనుమంతరావు, సత్యనారాయణ, సంజీవరెడ్డి, శ్రీధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికైన సభ్యులను శాలువాలతో సత్కరించారు.

కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

నిర్మల్‌చైన్‌గేట్: శ్రీ సరస్వతీ శిశు మందిర్ 2001–2002 పూర్వ విద్యార్థుల సమావేశం, నూతన ఫౌండేషన్ ఏర్పాటు కార్యక్రమాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని దివ్యగార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా గోనె రాజేందర్, అధ్యక్షుడిగా ఆదుముల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా ఒడ్నాల వేదప్రకాష్, కోశాధికారులుగా గుండోజి శ్రీకాంత్‌చారి, అడ్ప శ్యాం, సంయుక్త కార్యదర్శులుగా దుబ్బ నవీన్, కొండాజి శ్రావణ్, ప్రచార కార్యదర్శిగా సిరిసిల్ల పురుషోత్తం, సలహాదారులుగా పెంట సందీప్, బాలకృష్ణ, ఉమాకాంత్, శివప్రసాద్, సాయి, రాకేశ్, వొడ్నాల రాజు, పొడెల్లి శ్రీకాంత్, మెంగరాజ్ కుమార్, ఆడిటర్‌గా పవన్ కుమార్, తదితరులను ఎన్నుకున్నారు.

వాగులో ఇసుక తోడేళ్లు



కామోల్ వద్ద వాగులో ఇసుకను ట్రాక్టర్లలో నింపుతున్న దృశ్యం(ఫైల్)

- అడ్డూఅదుపూ లేని అక్రమ దందా
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- పట్టించుకోని అధికారులు



భైంసా మండలంలోని పెండ్‌పెల్లి, సాథ్‌గాం మధ్యలో వాగులో నుంచి ఇలా ఇసుకను తోడేస్తూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్నారు. ఇంత బహిరంగంగా జరుగుతున్నా అధికారులెవరూ పట్టించుకోవడం లేదంటూ సామాజిక మాధ్యమాల్లో పలువురు పోస్టులు పెట్టి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భైంసాటౌన్(ముధోల్): జిల్లాలో కొందరు అక్రమార్కులు అక్రమదందాలు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా వాగుల్లో నుంచి ఇసుకను అక్రమంగా తరలించుకుపోతున్నారు. వీడీసీల సహకారంతో యథేచ్ఛగా దందా కొనసాగిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి రాయల్టీ రూపంలో రావాల్సిన ఆదాయానికి గండి పడుతోంది. రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి ఇసుక అక్రమ దందాను అడ్డుకోవాలని పలువురు కోరుతున్నారు.

రూ.లక్షల్లో వేలం పాటలు

జిల్లా వ్యాప్తంగా వాగు పరీవాహక గ్రామాల్లో ఇసుక అక్రమదందా జోరుగా సాగుతోంది. వాగుల్లో ఇసుకను తరలించుకునేందుకుగానూ రూ.లక్షలు చెల్లించి వేలంపాటలో దక్కించుకుంటున్నారు. దీంతో గ్రామంలోని పెద్దల అండ ఉండడంతో ఇష్టారీతిన ఇసుకను తరలించుకుపోతున్నారు. భైంసా మండలంలోని కామోల్ వాగు నుంచి ఇసుక తరలింపునకు రూ.34 లక్షలకు దక్కించుకున్నట్లు తెలిసింది. ఇలా ఇక్కడే కాదు.. పెండ్‌పెల్లి, మాటేగాం, ఎగ్గాం, పిప్రి, వాటోలి, ఖత్‌గాంతో పాటు డివిజన్‌లోని అన్ని మండలాల్లో పలు వాగుల నుంచి ఇసుక అక్రమంగా తరలుతోంది.

ప్రభుత్వ ఖజానాకు గండి...

ఇసుకదందాతో పాటు జిల్లాలో మొరం అక్రమదందా సైతం జరుగుతోంది. భైంసా పట్టణంలోని కమలాపూర్‌గుట్ట, మాటేగాం, దేగాం, తదితర గ్రామాలతో పాటు డివిజన్ పరిధిలోని చాలాచోట్ల గుట్టలు తవ్వి మొరం అక్రమంగా తరలిస్తున్నారు. ఇలా ఇసుక, మొరం తవ్వకాలకు ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. కానీ జిల్లాలో ఎక్కడా ఇసుక, మొరం తవ్వకాలకు అనుమతి లేదని అధికారులు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో బహిరంగంగానే ఇసుక, మొరం అక్రమంగా తరలుతున్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

చర్యలు తీసుకుంటాం

భైంసా డివిజన్ పరిధిలో ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. గురువారం ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు సీజ్ చేశాం. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, మొరం అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటాం. – రవికుమార్, ఆర్డీవో, భైంసా

ఎక్కడి నుంచైనా 'రేషన్'



రేషన్ దుకాణం వద్ద కార్డుదారులు(ఫైల్)

జిల్లాలో రేషన్‌కార్డుల వివరాలు

ఏఎఫ్ఎస్‌సీ కార్డులు	12,589
ఎఫ్ఎస్‌సీ కార్డులు	1,96,063
లబ్ధిదారులు	6,43,420
అవసరమైన బియ్యం	32,171 క్వింటాళ్లు

- అమలులోకి వచ్చిన వన్ నేషన్.. వన్ రేషన్
- దేశంలో ఎక్కడైనా బియ్యం తీసుకునే అవకాశం
- వలస కూలీలకు ప్రయోజనం

భైంసాటౌన్(ముధోల్): ఉపాధి నిమిత్తం పలు ప్రాంతాల నుంచి కూలీలు వలస వెళ్తుంటారు. కొందరు కొన్నినెలల పాటు కుటుంబాలకు దూరంగా ఉంటూ జీవనం సాగిస్తుండగా మరికొందరు కుటుంబాలతో సహా వలస వెళ్లి ఉపాధి పొందుతుంటారు. దీంతో ఇలాంటి వారు సొంత రాష్ట్రంలో రేషన్ సరుకులు పొందలేని పరిస్థితి నెలకొనేది. వలస వెళ్లిన చోట రేషన్ లభించక ఇబ్బందులు పడే పరిస్థితి. ఈ నేపథ్యంలో కేంద్రం వన్ నేషన్.. వన్ రేషన్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇందులో భాగంగా ఏ రాష్ట్రానికి చెందిన వారైనా ఏ రాష్ట్రంలోనైనా సరుకులు పొందే అవకాశం కల్పించింది. మన రాష్ట్రంలోనూ ఇతర ప్రాంతవాసులు రేషన్ తీసుకునే సదుపాయం ఇప్పటికే అమలులో ఉంది.

వలస కూలీలకు తొలగనున్న ఇబ్బందులు

మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తదితర రాష్ట్రాల నుంచి ఎంతోమంది కూలీలు, కార్మికులు తెలంగాణకు వలస వస్తుంటారు. ముఖ్యంగా ఇటుక బట్టీల్లో పనిచేసేందుకు ఎంతోమంది భార్యాపిల్లలతో కలిసి వలస వస్తుంటారు. అలాగే పంట కోతల సమయంలో హమాలీ పనులతో పాటు వ్యవసాయ కూలీ పనుల కోసం ఎంతోమంది బిహార్ కార్మికులు వలస వస్తుంటారు. భవన నిర్మాణరంగంతో పాటు ఇతర పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు వేలసంఖ్యలో ఉంటారు. అయితే వీరికి రేషన్ కార్డులున్నా సరుకులు పొందలేని పరిస్థితి. దీంతో ఉపాధి నిమిత్తం వచ్చిన కూలీలు, కార్మికులు మార్కెట్‌లో అధిక ధరలతో సరుకులు కొనేందుకు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం వన్ నేషన్.. వన్ రేషన్‌తో వలస కూలీలకు ఇబ్బందులు తొలగనున్నాయి. ఈపాస్ యంత్రంలో వేలిముద్రలు, ఆధార్ నంబర్ ఆధారంగా సరుకులు పొందవచ్చు. ఏ ప్రాంతంలో రేషన్‌కార్డుదారులకు సరుకులు అందిస్తారో అవే సరుకులు వలస కూలీలకు అందిస్తారు. ఉదాహరణకు తెలంగాణలో రేషన్‌కార్డుదారులకు బియ్యం అందిస్తారు. ఈ ప్రాంతంలో వలసకూలీలకు సైతం రేషన్‌లో బియ్యం మాత్రమే అందిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి

వలస కార్మికుల కోసం ప్రవేశపెట్టిన వన్ నేషన్, వన్ రేషన్ విధానాన్ని ఇతర రాష్ట్రాలకు చెందినవారు సద్వినియోగం చేసుకోవాలి. జాతీయ ఆహార భద్రత కార్డు కలిగినవారు మాత్రమే అర్హులు. చాలామందికి అవగాహన లేకపోవడంతో సరుకులు తీసుకోవడం లేదు.

– తనూజ, పౌరసరఫరాల జిల్లా అధికారి

మళ్లీ.. ముప్పయేళ్లకు కలిశారు



జిల్లా కేంద్రంలో కలిసిన 1992-93 బ్యాచ్ విద్యార్థులు

- పిల్లలుగా విడిపోయి.. పిల్లాపాపలతో కలిసి..
- విద్యార్థుల కోసం గురువులూ వచ్చి..
- జిల్లా కేంద్రంలో అ'పూర్వ' సమ్మేళనం

నిర్మల్: 'అరే అనిల్.. నువ్వేనారా..! ఎన్నేళ్లయ్యిందిరా నిన్నుచూసి, ఏంరా ప్రవీణ్ ఎంతలా మారిపోయావ్‌రా.. అరే.. శ్రీనివాస్ ఏం చేస్తున్నావ్‌రా..!' అంటూ ఆశ్చర్యం, ఆనందం కలగలిసిన సందర్భంలో గట్టిగా తన మిత్రులను ఆలింగనం చేసుకున్నారు. 'ఏంరా విజయ్.. ఎక్కడున్నావ్‌రా. మన దోస్తుల కోసం యూకే నుంచి వచ్చావారా.. నువ్వు గ్రేట్‌రా..!' అంటూ దూరదేశం నుంచి వచ్చిన దోస్తును అంతా కలిసి హత్తుకున్నారు. 'హాయ్ అనురాధ.. ఎంత మారిపోయావే.. తను రాగవినా.. అస్సలు గుర్తుపట్టలేక పోతున్నా. వాళ్లు కళ్యాణి, ప్రవీణలక్ష్మి కదూ..' అంటూ తమ చిన్ననాటి స్నేహితురాళ్లను చూడగానే వాళ్లల్లో తెలియని అమితానందం. ఎప్పుడో ఏదో కోల్పోయింది.. మళ్లీ ఇన్నేళ్లకు దొరికినట్లుగా వాళ్లలో కొత్త అనుభూతి. ఇవన్నీ జిల్లాకేంద్రంలోని మారుతీఇన్‌లో ఆదివారం నిర్వహించిన పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో కనిపించాయి. ఎప్పుడో 1992–93లో స్థానిక బాగులవాడ శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో చదువుకున్న విద్యార్థులంతా ఒక్కచోట కలుసుకున్నారు. ముప్పయేళ్ల క్రితం పదోతరగతిలో విడిపోయిన వారంతా మళ్లీ ఇప్పుడే కలిశారు. ఇన్నేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత కలుసుకోవడంతో వాళ్లంతా చాలా సంతోషంగా ఫీలయ్యారు. తమ కుటుంబాలు, పిల్లలు, తమ ఉద్యోగ, ఉపాధి విషయాలతో పాటు చిన్నప్పటి తమ బాల్యాన్ని గుర్తుచేసుకున్నారు.

ఆ గురువులూ గ్రేట్..

ముప్పయేళ్ల తర్వాత ఒక్కదగ్గరికి వస్తున్న మిత్రులను కలిసేందుకు యూకే, హైదరాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ వంటి దూరప్రాంతాల నుంచి స్నేహితులందరూ తరలివచ్చారు. వీరంతా ఒకెత్తు అయితే ఎప్పుడో చిన్నప్పుడు చదువులు చెప్పిన పిల్లలు 'తప్పకుండా రండి ఆచార్జీ..' అని పిలవగానే అల్లంత దూరం నుంచి తమ విద్యార్థుల కోసం ఆ గురువులూ తరలిరావడం విశేషం. ఉద్యోగరీత్యా నిర్మల్‌లో ఉండి రిటైర్డ్ అయిన తర్వాత తమ స్వగ్రామమైన కడపకు వెళ్లిన సుబ్బారావు, కాకినాడలో నివాసం ఉంటున్న వరప్రసాద్, హైదరాబాద్‌లో ఉంటున్న అప్పటి ప్రధానాచార్యులు రావుల సూర్యనారాయణ, ఇచ్చోడలో సెటిలైన ఉపాధ్యాయులు ఇస్తారి, నయన, రామానుజాచార్యులు ఇలా ఆనాటి గురువులంతా కార్యక్రమానికి వచ్చారు. వారిని పూర్వవిద్యార్థులు ఘనంగా సన్మానించారు. తమ గురువులకు పాదాభివందనం చేసి గౌరవించుకున్నారు. అందరూ కలిసి భోజనం చేశారు. ఇలా తమ ముప్పయేళ్ల అనుభవాలను పంచుకుంటూ కనీసం మూడేళ్లపాటు అనుభూతినిచ్చేలా కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

- ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌రావు
- 'సాక్షి' ఫోన్ ఇన్‌కు వెల్లువలా సమస్యలు



ఫోన్ ఇన్‌లో మాట్లాడుతున్న కమిషనర్ రత్నాకర్‌రావు

సాక్షి ఫోన్ ఇన్

ఖానాపూర్: పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌రావు అన్నారు. వీధికుక్కలు, కోతులు, పందుల బెడద, తాగునీరు, వీధి దీపాలు, పారిశుధ్యం, తదితర సమస్యలపై శనివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో ప్రజల నుంచి సమస్యలు వెల్లువెత్తాయి. పట్టణంలోని ఆయా వార్డులకు చెందిన ప్రజలు, నాయకులు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని నమోదు చేసుకున్న కమిషనర్ ఎమ్మెల్యే రేఖానాయక్, చైర్మన్ అంకం రాజేందర్, కౌన్సిలర్లు, పాలకవర్గం సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ప్రశ్న: పట్టణంలో రోడ్డు వెడల్పు పనుల్లో జాప్యంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పనులు ఎప్పటి వరకు పూర్తి చేస్తారు?

– తిలక్‌రావు, 11వ వార్డు

కమిషనర్: పట్టణంలో జరుగుతున్న రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే రేఖానాయక్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు.

ప్రశ్న: ఇంటి అనుమతుల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీనిపై మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

– ఆకుల శ్రీనివాస్, 2వ వార్డు, శివాజీనగర్

కమిషనర్: మున్సిపల్ నిబంధనల మేరకే టీఎస్ బీపాస్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి అనుమతులు ఇస్తున్నాం. నిబంధనల మేరకు నిర్మాణం చేపడితే త్వరగానే అనుమతులు వస్తాయి. ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు ఉంటే ఇన్‌చార్జి టౌన్ ప్లానింగ్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ఖానాపూర్‌లో కంకర ఫ్యాక్టరీని తలపిస్తున్న దుమ్ము, ధూళిని ఎప్పుడు, ఎలా నిర్మూలిస్తారు?

– శ్యాం, 5వ వార్డు, ఇంద్రానగర్

కమిషనర్: ప్రస్తుతం రోడ్డు వెడల్పు పనుల కారణంగా ఈ పరిస్థితి తలెత్తింది. దుమ్ము, ధూళి లేవకుండా మున్సిపల్ ఆధ్వర్యంలో రేపటి నుంచే రోడ్డుపై నీటిని పట్టిస్తాం.

ప్రశ్న: రోడ్డు వైడింగ్ పనుల్లో పర్యవేక్షణ లేకపోవడంతో పాటు, పనుల్లో నాణ్యత ఉండడం లేదు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఒక్కరోజు కూడా రావడం లేదు. కొలతలు లేకుండా ఇష్టారాజ్యంగా పనులు చేయడంపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

– మడిగెల గంగాధర్, 11వవార్డు, విద్యానగర్

కమిషనర్: పనులు జరిగే సమయంలో అందుబాటులో ఉండాలని సంబంధిత ఏఈకి సూచిస్తా. పనుల్లో నాణ్యత లోపించకుండా రెగ్యులర్‌గా క్యూరింగ్ జరిగేలా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: డబుల్ బెడ్‌రూం ఇళ్లు అర్హులకు అందేలా చర్యలు తీసుకుంటున్నారా?

– జక్కుల గంగామణి, 11వ వార్డు, విద్యానగర్

కమిషనర్: డబుల్ బెడ్‌రూం ఇళ్లపై ఇప్పటికే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పలు విడతల్లో సర్వేలు జరిగాయి. ఈ సమస్య రెవెన్యూ అధికారుల పరిధిలో ఉంది.

ప్రశ్న: మిషన్ భగీరథ రోడ్లన్నీ ధ్వంసమవుతున్నాయి. రోడ్ల మరమ్మతుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

– దాసరి రాజన్న, రెండోవార్డు, శివాజీనగర్

కమిషనర్: దశల వారీగా రోడ్లన్నీ మరమ్మతు చేయిస్తున్నాం. సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తా.

ప్రశ్న: కప్పలకుంట ఏరియాలో వీధి దీపాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎప్పుడు ఏర్పాటు చేయిస్తారు?

– ఎనగందుల రవితేజ, 11వ వార్డు, విద్యానగర్

కమిషనర్: వెంటనే వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం.

ప్రశ్న: మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీపై పట్టించుకోరా? కోతుల బెడదపై చర్యలు తీసుకుంటున్నారా? – ఎంఏ వకీల్, 7వ వార్డు, పద్మావతినగర్

కమిషనర్: లీకేజీలు నాదృష్టికి తీసుకువస్తే వెంటనే మరమ్మతు చేయిస్తా. కోతులను తరలించేలా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: చికెన్ వ్యర్థాలు, చెత్తాచెదారం రోడ్డు పక్కన లేకుండా చూడాలి. వ్యర్థాల కోసం వచ్చే శునకాలతో అటవీ జంతువులకు ప్రాణహాని ఉంది?

– వినాయక్, ఎఫ్ఆర్‌ఓ, ఖానాపూర్

కమిషనర్: చికెన్ వ్యర్థాలపై ఇప్పటికే దుకాణదారులకు అవగాహన కల్పించాం. అయినప్పటికీ తీరు మారకుంటే లైసెన్స్ రద్దు చేయడంతో పాటు రూ.25వేల జరిమానా విధిస్తాం. దుకాణదారులు మున్సిపల్ వాహనంలోనే వ్యర్థాలను వేయాలి.

ప్రశ్న: కోతులు, పందుల బెడద నివారణకు చర్యలు తీసుకుంటున్నారా?

– పంబాల భీమేశ్వర్, 4వ వార్డు, శ్రీరాంనగర్

కమిషనర్: కోతుల బెడద నివారణకు ఇప్పటికే చర్యలు చేపట్టాం. కుక్కల బెడద నిర్మూలించేందుకు ఆదివారం నుంచే చర్యలకు శ్రీకారం చుట్టాం.

ప్రశ్న: డ్రెయినేజీ నీరంతా ఇంటి ఆవరణతో పాటు రోడ్డుపైకి వస్తోంది. దీనికి ఎలాంటి చర్యలు తీసుకుంటారు? – అస్లాం, 8వ వార్డు, అర్బత్ కాలనీ

కమిషనర్: సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించి ప్రస్తుతం తాత్కాలిక చర్యలు చేపడతాం. డ్రెయినేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి పాలకవర్గ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తాం.

ప్రశ్న: రోడ్లపై పశువుల సంచారం లేకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

– నర్సయ్య, 7వ వార్డు

కమిషనర్: పశువుల యజమానులకు ఎన్నిసార్లు చెప్పినా స్పందించడం లేదు. త్వరలో వాటిని గోశాలకు తరలించేలా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: వేసవిలో నీటి ఎద్దడి నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

– గరక శ్రీహరి, 7వ వార్డు, ఎరుకలవాడ

కమిషనర్: ప్రస్తుతం మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందిస్తున్నాం. ఎక్కడైనా నీరు అందని ప్రాంతాలుంటే మా దృష్టికి తీసుకురావాలి.

సాధించాలన్న తపనతో చదవాలి

- డీఈవో రవీందర్‌రెడ్డి



ప్రథమ బహుమతి అందజేస్తున్న డీఈవో

నిర్మల్‌రూరల్: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించాలన్న తపనతో చదవాలని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రానికి చెందిన తన్నీరు వెంకట్రావు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహిస్తూ 'మీలో ఎవరు లక్షాధికారి' పేరుతో క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో జిల్లాలోని 108 ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొనగా 20 మందిని ఎంపిక చేశారు. విజేతలకు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఉమామహేశ్వర బంకెట్ హాల్‌లో డీఈవో రవీందర్‌రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ప్రథమ బహుమతి రూ.లక్ష (సిద్ధార్థ, మస్కాపూర్ ఉన్నత పాఠశాల), ద్వితీయ బహుమతి రూ.50 వేలు(హర్షవర్ధన్, పునకల్ ఉన్నత పాఠశాల), తృతీయ బహుమతి రూ.30 వేలు (సౌజన్య, లింగాపూర్ ఉన్నత పాఠశాల), మరో 17 మందికి రూ.1,116 నగదు, ప్రశంస పత్రాలు అందజేశారు. విద్యార్థులు గెలుపొందిన నగదులో 50 శాతం పాఠశాలలో మౌలిక సదుపాయాల కొరత తీర్చేందుకు వినియోగించనున్నారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల సహాయ అధికారి పద్మ, ప్రముఖ కంటి వైద్య నిపుణులు కృష్ణంరాజు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సద్గురు మహరాజ్ బోధనలు అనుసరణీయం



జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

ముధోల్: సద్గురు మహరాజ్ బోధనలు అనుసరణీయమని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పశుపతినాథ్ ఆలయ కల్యాణ మండపంలో మోచి సంఘం ఆధ్వర్యంలో శ్రీ సంత్ శిరోమణి రోహిదాస్ 646 వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మాట్లాడుతూ గురువుల స్థానం ఎంతో ఉన్నతమైందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అఫ్రోజ్‌ఖాన్, ఎంపీటీసీలు భూమేష్, శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ రాజేందర్, మోచి సంఘ నాయకులు సాయిలు, భోజారాం,అబ్బయ్య, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓసీ సంఘాల జిల్లా కమిటీలో ఇద్దరికి చోటు


శివ ప్రసాద్‌రెడ్డి


అశ్విన్ కుమార్

ఆదిలాబాద్‌అర్బన్: ఓసీ సంఘాల జిల్లా కమిటీలో ఇద్దరికి చోటు కల్పించినట్లు ఆ కమిటీ జిల్లా అధ్యక్షుడు జనగం సంతోష్ తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతం శివ ప్రసాద్ రెడ్డి, కోశాధికారిగా జిల్‌పెల్లి అశ్విన్ కుమార్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఓసీ సంఘాలను పటిష్ట పర్చడమే లక్ష్యమన్నారు.

మరాఠా కునభిలను ఓబీసీలో చేర్చుతాం


హన్సరాజ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

ఆదిలాబాద్: మరాఠా కునభి, మరాఠా నాన్ బ్రాహ్మిణ్‌లను ఓబీసీ జాబితాలో చేర్చడానికి సుముఖంగా ఉన్నట్లు కేంద్ర మాజీ మంత్రి, జాతీయ బీసీ కమి షన్ చైర్మన్ హన్సరాజ్ గంగారాం అహీర్ పేర్కొన్నా రు. హైదరాబాద్ నుంచి చంద్రపూర్ వెళ్తూ జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంక ర్ నివాసంలో ఆదివారం ఆయన విడిది చేశారు. ఈ సందర్భంగా మరాఠా కునభి సంఘం నాయకులు తమను ఓబీసీ జాబితాలో చేర్చాలని గంగారాంకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఆయన సా నుకూలంగా స్పందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఈ విషయమై ప్రతిపాదన అందితే, వెంటనే మరాఠా కునభి సమాజ్‌ను ఓబీసీ జాబితాలో చేర్చుతామని వెల్లడించారు. బీసీలందరికీ సామాజిక న్యా యం అందించాలనే దృష్టితో బీసీ కమిషన్ ముందు కు వెళ్తోందని చెప్పారు. నాయకులు నగేశ్, సుహాసినీరెడ్డి, విజయ్ బోయర్, జోగు రవి, మయూర్ చంద్ర, లోక ప్రవీణ్‌రెడ్డి, సోమ రవి, వేదవ్యాస్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

తాంసి: మండలంలోని సావర్గాం గ్రామ సమీపంలో అంతర్రాష్ట్ర రహదారి పక్కన ఉన్న చెరువులో ఆదివారం ఉదయం ట్రాక్టర్ బోల్తాపడింది. పిప్పల్‌కోటి నుంచి ఆదిలాబాద్‌వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను డ్రైవర్ వేగంగా నడపడంతో మూలమలుపు వద్ద చెరువులోకి దూసుకెళ్లి బోల్తాపడింది. డ్రైవర్‌కు రాజు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

తనయుడి చితికి తల్లి నిప్పు


అంత్యక్రియల్లో తల్లి రాధ

జన్నారం: జన్నారం మండలం చింతగూడకు చెందిన దాసరి హర్ష (22) నిజామాబాద్ జిల్లా మెడికల్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతూ శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. శనివారం హర్ష మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురాగా పెద్ద ఎత్తున స్థానికులు తరలివచ్చి నివాళులర్పించారు. అశ్రునయనాల నడుమ అంత్యక్రియలు నిర్వహించగా గ్రామస్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. తండ్రి శ్రీనివాస్ మలేషియాకు నెలరోజుల క్రితమే తాపీమేస్త్రీ పనిపై వెళ్లాడు. చివరిచూపునకు సైతం నోచుకోలేదు. దీంతో తల్లే కొడుకు చితికి నిప్పుపెట్టింది. ఈ దృశ్యం స్థానికులను కదిలించింది.


శివాజీచౌక్‌లో నిజామాబాద్, హైదరాబాద్ వెళ్లే బస్సుల కోసం..



ఎండలో 'ప్రయాణికుల' ఎదురుచూపు

నిర్మల్ జిల్లా ఏర్పడి ఏడేళ్లు గడుస్తున్నా కేంద్రంలో ఇప్పటి వరకు పలు చౌరస్తాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాపులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండల తీవ్రత పెరగడంతో బస్టాప్‌ల వద్ద చిన్నారులు, మహిళలు, వృద్ధులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా అధికారులు బస్సు షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్


భైంసా వెళ్లే ప్రధాన రహదారిపై



బస్సు షెల్టర్ లేక నేలపై కూర్చున్న వృద్ధులు, మహిళలు


బస్సు కోసం ఎండలో ఎదురుచూస్తున్న ప్రయాణికులు

రెచ్చిపోతున్న సైబర్ మోసగాళ్లు


- పెన్సిల్స్ వ్యాపారం పేరిట టోకరా
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

ఆదిలాబాద్‌టౌన్: సైబర్ మోసగాళ్లు రోజురోజుకు కొత్త పుంతలు తొక్కుతున్నారు. ఇదివరకు ఓటీపీ అడిగి డబ్బులు మాయం చేయడం, లింక్‌లు పంపించడం, కేవైసీ తదితర పేరిట డబ్బులు కాజేసిన విషయం తెలిసిందే. తాజాగా ఇంటి వద్దనే ఉంటూ వ్యాపారం చేసుకోవచ్చు అంటూ నమ్మబలికి అందినకాడికి దండుకున్న ఘటన ఆదిలాబాద్ పట్టణంలో చోటుచేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. ఆదిలాబాద్ పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన పట్కర్‌వార్ గంగాసింగ్ మేస్త్రి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గతనెల 30న ఆయన ఫోన్‌కు వాట్సాప్ ద్వారా ఓ వీడియో వచ్చింది. అందులో పెన్సిల్, రబ్బర్ ప్యాకింగ్ చేసి ఇంటివద్దనే ఉంటూ ఉపాధి పొందవచ్చని తెలిపారు. దీంతో ఆ వీడియోలోని ఫోన్‌నంబర్‌కు ఫోన్ చేసి వివరాలను తెలుసుకున్నాడు. మొదట ఐడెంటిటి కార్డు కోసం రూ.650 డబ్బులు పంపించాలని తెలుపగా, ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. ఆ తర్వాత అతని నుంచి మీరు పంపిన డబ్బులు



పంపించిన వీడియో, వాట్సాప్ చాటింగ్ దృశ్యం

క్యాన్సల్ అయ్యాయి, రూ.1499 పంపించాలని చెప్పారు. జీఎస్టీ, వాహన అద్దె, పెన్సిళ్ల కోసం డబ్బులు పంపించాలని చెప్పడంతో రూ.1500, రూ.3100, రూ.4550, రూ.8700 ఇలా మొత్తం రూ.23,199 డబ్బులు ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. సాయంత్రం వరకు హైదరాబాద్ నుంచి పెన్సిళ్లు వస్తాయని నమ్మబలికాడు. సాయంత్రం వరకు అవి రాకపోగా తాను మోసపోయానని తెలుసుకున్నాడు. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా సైబర్‌క్రైమ్‌లో ఆన్‌లైన్ ద్వారా కేసు నమోదు చేశారు. ఆదివారం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఈ విషయమై ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా జిల్లాలో అనేక మంది సైబర్ మోసగాళ్ల చేతిలో మోసపోతున్నారు. గతనెలలో ఓ వ్యక్తి క్రెడిట్ కార్డ్ రివార్డ్ పాయింట్ల కోసం ఓటీపీ చెప్పగా రూ.49వేలు మోసపోగా, తరచూ ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.



బాధితుడు ఫోన్‌పే ద్వారా పంపించిన డబ్బులు

ప్రశాంతంగా గురుకుల సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్ స్కూల్‌లో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రవేశపరీక్ష రాయడానికి మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 6వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో కలిపి 88 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. 6వ తరగతిలో 618 మంది విద్యార్థులకు 536 మంది పరీక్షకు హాజరు కాగా మరో 82 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియెట్‌లో 590 మందికి 518 మంది విద్యార్థులు పరీక్ష రాయగా మరో 72మంది విద్యార్థులు డుమ్మా కొట్టారు. ఉదయం 10గంటలకు ప్రవేశపరీక్ష ప్రారంభమై మధ్యాహ్నం ఒంటి గంటకు ముగిసింది. పరీక్షకు గంట ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. ఎండతీవ్రతను దృష్టిలో పెట్టుకుని పరీక్ష కేంద్రాల్లో చల్లటి నీటి కుండలతో పాటు ఫస్ట్ ఎయిడ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బెల్లంపల్లి సీఓఈ గురుకుల బాలుర కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదిలాబాద్ రీజియన్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి సందర్శించి పరీక్ష జరుగుతున్న తీరును పర్యవేక్షించారు. విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా ఆయా పరీక్షా కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లు ఐనాల సైదులు, సంగనబట్ల శ్రీనివాస్, కె.రమా కళ్యాణిలు తగిన ఏర్పాట్లు


బెల్లంపల్లి పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌సీవో

చేశారు. డిపార్ట్‌మెంటల్ అధికారులుగా కోటి చింతల మహేశ్వర్‌రావు, జ్యోతి వ్యవహరించారు.

పరీక్ష కేంద్రాల వారీగా...

బెల్లంపల్లి సీఓఈ బాలుర గురుకుల కళాశాలల్లో 6వ తరగతిలో 201 మంది విద్యార్థులకు 172మంది విద్యార్థులు పరీక్ష రాయగా 29మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం 247మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 227మంది వచ్చారు. 20మంది పరీక్షకు దూరంగా ఉన్నారు.

ఆదిలాబాద్ గురుకుల బాలికల సీఓఈ పరీక్ష కేంద్రంలో...

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సంక్షేమ బాలికల గురుకుల సీఓఈలో 6వ తరగతిలో 200 మంది విద్యార్థులు పరీక్ష రాయల్సి ఉండగా 170 మంది


హాల్‌టిక్కెట్ నంబరు చూసుకుంటున్న విద్యార్థులు

విద్యార్థులు పరీక్ష రాశారు. మరో 30మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. ఇంటర్మీటియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం 199 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వీరిలో 165మంది విద్యార్థులు హాజరు కాగా 34మంది పరీక్షకు హాజరు కాలేదు.

నిర్మల్ (జామ్) బాలికల గురుకుల కళాశాలలో ....

నిర్మల్ జిల్లా సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 6వ తరగతిలో 217 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 194 మంది హాజరయ్యారు. 23 మంది గైర్హాజరయ్యారు. అదే తీరుగా ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం 144 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 126మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 18మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు.


అడెల్లి ఆలయం ఎదుట భక్తుల సందడి

అడెల్లిలో భక్తుల సందడి

సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ దేవాలయం ఆదివారం భక్తుల సందడితో కిటకిటలాడింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు పొరుగు జిల్లాలైన నిజామాబాద్, కరీంనగర్, వరంగల్‌ల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆయిటి చందు, ఇన్‌చార్జి ఈఓ రవికిషన్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డి ప్రత్యే పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.


అడెల్లి అమ్మవారి దర్శనం కోసం క్యూకట్టిన భక్తులు

పులుల కదలికల పరిశీలన

తాంసి: భీంపూర్ మండలం గుంజాల, గొల్లఘాట్ గ్రామాల శివారులో మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి వచ్చిన నాలుగు పులులు రెండు రోజులుగా సంచరిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన జిల్లా అటవీశాఖ అధికారులు వాటి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం గుంజాల శివారులోని అటవీ ప్రాంతంలో ఎఫ్ఎస్వో అహ్మద్‌ఖాన్ బేస్‌క్యాంపు సిబ్బందితో కలిసి పులులు సంచరించిన ప్రదేశాలను పరిశీలించారు. వాటి పాదముద్రలు సేకరించి కొలతలు తీసుకున్నారు. శనివారం బేస్‌క్యాంపు సిబ్బందికి పులులు కనిపించిన నేపథ్యంలో అటవీశాఖ సిబ్బంది గుంపులుగా వెళ్లారు. ఈ సందర్భంగా ఎఫ్ఎస్వో మాట్లాడుతూ.. పులులు సంచరించే అవకాశం ఉన్న ప్రాంతాల్లో 10 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక బేస్‌క్యాంపు సిబ్బందితో పులుల


అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది

సంరక్షణ చర్యలు చేపడతామని పేర్కొన్నారు. గుంజాల అటవీ ప్రాంతం పులుల సంచారానికి అనువుగా ఉండడంతో అవి ఇక్కడే ఉన్న ఆనవాళ్లు కనిపిస్తున్నాయని తెలిపారు. పులుల సంచారం నేపథ్యంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు పలు సూచనలు చేశారు. టాస్క్‌ఫోర్స్ అధికారి గులాబ్‌సింగ్, ఎనిమల్ ట్రాకర్స్ కృష్ణ, హనుమంత్, సోనేరావు, సిబ్బంది ఉన్నారు.

ఆలయాలు ధ్వంసం చేసిన వ్యక్తి అరెస్టు

- చిలకల భీమన్న ఆలయానికి నిప్పు
- సకాలంలో గమనించిన స్థానికులు
- వరుస ఘటనలతో స్థానికుల్లో ఆందోళన
- గంటల వ్యవధిలోనే పట్టుకున్న పోలీసులు


తగలబడుతున్న భీమన్న దేవాలయం

చింతలమానెపల్లి: మండల కేంద్రంలోని దుబ్బగూడలోని చిలకల భీమన్న ఆలయంలో ఆదివారం దుండగుడు నిప్పంటించాడు. మండలంలోని ఖర్జెల్లి శివాలయలంలో విగ్రహాల ధ్వంసం చేసిన మరుసటి రోజే చిలకల భీమన్న ఆలయానికి నిప్పుపెట్టడం స్థానికంగా కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం... చిలకల భీమన్న ఆలయం గ్రామం శివారులో ఉంది. ఆదివారం ఉదయం అటువైపు వెళ్లిన పలువురికి ఆలయంలోనుంచి పొగలు రావడాన్ని గమనించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. స్థానికులు చేరుకుని మంటలు ఆర్పివేశారు. అక్కడికి చేరుకున్న ఎస్సై విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు విచారణ ప్రారంభించారు. నిప్పంటించేందుకు సమీపంలోని పంట భూముల్లోని కర్రలను, ఆకులను సేకరించి ఆలయంలో పేర్చి నిప్పంటించినట్లు పోలీసులు గుర్తించారు.

నిందితుడి అరెస్టు

వరుస ఘటనలతో పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ఎస్సై విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు ముమ్మరం చేశారు. చింతలమానెపల్లి గ్రామంలోని సీసీ కెమెరాలను పరిశీలించగా ఉదయం 7గంటల సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన సలుగుపల్లి గ్రామానికి చెందిన తాళ్ళపల్లి వెంకటేష్ అలియాస్ జోష్ అనే వ్యక్తిని గుర్తించారు. మండల కేంద్రం నుంచి అనుకోడ గ్రామానికి వెళ్లే మార్గంలో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ నెల 25న మండలంలోని ఖర్జెల్లి శివాలయంలో, 24న బెజ్జూర్ మండలంలోని అందుగులగూడెం మల్లన్నగుట్ట ఆలయం ధ్వంసం చేసినట్లు నేరం ఒప్పుకున్నాడు. నిందితుడి తమ్ముడు మూడేళ్ల క్రితం చనిపోయాడు. తన తమ్ముడి చావు కు హిందూ దేవుళ్లే కారణమని భావించి ఆలయాల ధ్వంసానికి పాల్పడినట్లు విచారణలో తేలినట్లు పోలీసులు తెలిపారు.

దంపతులను విడదీసిన రోడ్డు ప్రమాదం


సంఘటన స్థలంలో సాగర్ మృతదేహం


తీవ్ర గాయాలపాలైన లలిత

- భర్త దుర్మరణం.. భార్య పరిస్థితి విషమం
- చాందా(టి) జాతీయ రహదారిపై ఘటన

ఆదిలాబాద్‌రూరల్: రోడ్డు ప్రమాదం దంపతులను విడదీసింది. ఓ శుభకార్యానికి వచ్చి తిరిగి స్వగ్రామం వెళ్తున్న క్రమంలో లారీ రూపంలో మృత్యువు ముంచుకొచ్చింది. మండలంలోని చాందా(టి) సమీపంలో ఆదివారం జరిగిన ప్రమాదంలో భర్త మృతిచెందగా భార్య మృత్యువుతో పోరాడుతోంది. స్థానికుల వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని కేళాపూర్ తాలుకా టింబి గ్రామానికి చెందిన రామగిరివార్ సాగర్ (60), రామగిరివార్ లలిత (55) దంపతులు ఆదిలాబాద్ పట్టణంలోని బంధువుల ఇంటికి వచ్చారు. అనంతరం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో చాందా(టి) శివారు ప్రాంతంలోని బైపాస్ రోడ్డు దాటుతున్న క్రమంలో లారీ ఢీకొంది. సాగర్ సంఘటనా స్థలంలోనే మృతిచెందగా భార్య లలితకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఆదిలాబాద్‌రూరల్ సీఐ రఘుపతి చేరుకుని వివరాలు సేకరించారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు ఆస్పత్రికి చేరుకుని రోధించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ గోవింద్ వివరించారు.